తున్న రామచంద్రుడిని చూసి పులకిస్తున్న అయోధ్యకు విశ్వామిత్రుడి రాక అశనిపాతమైంది. యాగ సంరక్షణకు రాముణ్ని పంపాలని విశ్వామిత్రుడు కోరగా.. దశరథుడు హతాశుడయ్యాడు. చతురంగ బలాలతో తానే వస్తానంటాడు కానీ, రాముణ్ని పంపడానికి సాహసించడు. ఈ సందర్భంలో రాజ మందిరంలో దశరథుడు ఎంతగా వగచాడో... అయోధ్య పురవాసులూ అంతే కుదేలయ్యారు. రాముడు యాగ రక్షణకు విశ్వామిత్రుడి వెంట వెళ్తున్నాడన్న వార్త దావానలంలా నగరమంతా వ్యాపించింది. పిల్లలు, తల్లులు, పెద్దలు అందరూ బాలరాముడిపై పెద్ద భారం మోపుతున్నారే అని కంగారుపడ్డారు. యాగం పూర్తయిన వెంటనే వస్తాడని తెలిసినా.. ఆ కొన్ని రోజులు కూడా రాముణ్ని చూడకుండా ఎలా ఉండగలమని వాళ్ల బాధ. అంతలోనే.. విశ్వామిత్రుడితో వెళ్తే విశ్వవిజేతగా నిలిచే శక్తి సామర్థ్యాలు తమ రాముడికి వస్తాయని ఊరడిల్లారు. వశిష్ఠుడు చెప్పినట్టుగా, దశరథుడు ఆశించినట్టుగా, అయోధ్యవాసులు కోరుకున్నట్టుగా.. విశ్వామిత్రుడి అనుగ్రహంతో రాముడు సర్వాస్త్ర ప్రవీణుడయ్యాడు. రాముడిగా వెళ్లి కల్యాణ ధాముడిగా తిరిగివచ్చాడు. నవదంపతులు నగరంలోకి అడుగుపెట్టే వేళకు ప్రతి ఇంటిపైనా పతాకాలు ఎగురవేశారు ప్రజలు. ప్రతి లోగిలినీ ముగ్గులతో ముచ్చటగా తీర్చిదిద్దారు. ప్రతి వీధీ జనంతో కిటకిటలాడింది. తమ ఇంట్లోనే పెండ్లి అయిందన్నట్టుగా అందరూ జేజేలు కొడుతూ.. మంగళాశీర్వాదాలు పలుకుతూ కొత్తజంటను స్వాగతించారు. నగరంలోని ప్రముఖులు, పండితులు స్వయంగా దశరథుడి దగ్గరికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా విశ్వామిత్రుడి వెంట వెళ్తున్న



రాముణ్ని చూసి దిగాలు పడిన అయోధ్య ప్రజలు.. జానకి రాముడిగా తరలివస్తున్న తమ వేల్పును చూసి వేనోళ్ల అభినందించారు. 'బొమ్మ వధువు.. అంత అందంగా ఉంద'ని రెప్పవాల్చకుండా సీతమ్మ వంకే చూసి మురిసిపోయారని విశ్వనాథ ప్రస్తావించారు.

**పట్టాభిరాముడి కోసం..**

రఘువంశంలో అందరూ యోధులే! ప్రజారంజక పాలకులే! వారి పాలనలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచింది. ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లారు. తమ పూర్వికుల కీర్తిని మరింత ఇనుమడింపజేశాడు దశరథుడు. ప్రజలను కన్నబిడ్డల్లా పాలించాడు. అయినా.. తమ రాముడు ఎప్పుడెప్పుడు పట్టాభిరాముడు అవుతాడా అని ఎదురుచూసేవారు కోసల ప్రజలు. ఆ ముహూర్తం రానే వచ్చింది. రాముణ్ని ఇంతగా ఆరాధిస్తున్న ప్రజలకు అతణ్ని రాజును చేయడం కన్నా విలువైన బహుమతి ఏముంటుందని అనుకున్నాడు దశరథుడు. ప్రజాభిప్రాయం కోరాలనుకున్నాడు. నగర ప్రజలను, జానపదులను, ప్రముఖులను, సామంత రాజులను పిలిపించుకొని తన అభిప్రాయం వారితో పంచుకున్నాడు. రామ పట్టాభిషేకానికి అందరూ ముక్తకంఠంతో అంగీకరించారు.

**ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలం।**
**గజేన మహతా యాంతం రామం ఛత్రావృతాననమ్॥**

(అయోధ్య కాండ)

'శత్రుంజయ గజాన్ని అధిరోహించి, శ్వేతచ్ఛత్ర ఛాయలో పురవీధుల్లో ఊరేగుతూ వచ్చే రాముణ్ని చూడాలనీ, చూసి ఆనందించాలనీ మేమంతా మిక్కిలి ఉవ్విళ్లూరుతున్నాం' అని ప్రకటించారు. 'దశ

## ఆలయ విశేషాలు

**సర్వోన్నతంగా నిర్మించిన అయోధ్య రామమందిరం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేవాలయంగా రూపుదిద్దుకుంటున్నది. పునాది నుంచి ఆలయ శిఖరం వరకు ఎక్కడా ఇనుము, సిమెంట్ వాడలేదు. పూర్తిగా రాతితో నిర్మించిన అద్భుతం ఇది. మూడు దశాబ్దాలుగా దేశం నలుమూలల నుంచి సేకరించిన రెండు లక్షల ఇటుకలను ఆలయ పీఠం కోసం వినియోగించారు. ఈ సుందర మందిరంలో 51 అంగుళాల బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. విల్లంబులు ధరించిన కౌసల్య తనయుడు మంగళవారం నుంచి 'కౌసల్యా సుప్రజా రామా..' అని సుప్రభాత సేవలు అందుకోనున్నాడు.**



**శంకుస్థాపన:**
**2020 ఆగస్టు 5**

**ప్రాణ ప్రతిష్ఠ:**
**2024 జనవరి 22**

**వెడల్పు: 235 అడుగులు**

**ఆలయ శిఖరం ఎత్తు:**
**161 అడుగులు**

**నిర్మాణ విస్తీర్ణం: 57,400 చదరపు అడుగులు**

**ఆలయం పొడవు: 360 అడుగులు**

**సుముహూర్తం: మధ్యాహ్నం 12.29 గంటల 8 సెకండ్ల నుంచి 12.30 గంటల 32 సెకండ్ల వరకు (84 సెకండ్లు)**

**రామ మందిరం కాంప్లెక్స్**
**మొత్తం విస్తీర్ణం: 110 ఎకరాలు**
**ప్రధాన ఆలయ ప్రాంగణం విస్తీర్ణం: 2.77 ఎకరాలు**